# పసివాళ్ళ కలవరం



వి. రాజారామమోహనరావు

"రేపట్నుంచీ యింక పన్లోకి రానూ." అన్నాడు చంద్రం.

ఆ మాట అర్థంకానట్టు అయోమయంగా వాడి వేపు చూశాడు రాజిగాడు.

లోపల సినిమా జరుగుతున్న ధ్వని లీలగా ఆ వరండాలోకి వినిపిస్తోంది. అంతకు ముందే హాలు మేనేజరు యింటికి వెళ్ళిపోటంతో వాళ్ళిద్దరికీ ఆ రోజు కింకేం పనిలేనట్టే. అంతకు ముందే చంద్రం తండ్రి రావటం, హాలు మేనేజరుతో మాట్లాడటం రాజిగాడు కూడా చూశాడు. విషయం ఏదో వుందని రాజిగాడికీ తెలుసు. కానీ వివరాలు అర్థంకావటం లేదు. తిరిగి చంద్రం ఏమైనా మాట్లాడతాడేమో అని కాసేపు చూశాడు. వాడేం మాట్లాడకపోవటంతో రాజిగాడే అడిగాడు.... "ఏంటిరా....?" అని.

"మా అయ్య కొత్తనౌకరీ చూశాడు." అన్నాడు చంద్రం. వాళ్ళిద్దరిదీ పది పన్నెండేళ్ళ మధ్య వయస్సే. తల్లీ తండ్రీ తలుచుకుంటే యింక ఆ పనికి తిరుగులేదని వాళ్ళిద్దరికీ తెలుసు.

చంద్రం మర్నాటి నుంచీ పని మానేస్తున్నాడన్నది బుర్రకెక్కిన మరుక్షణం నుంచీ రాజిగాడికి తన వొంటరితనం కళ్ళముందు మెదలటం మొదలైంది. పనిలోకి ఒక్కడూ రావాలి. పొద్దున్నించీ రాత్రి రెండో ఆట సినిమా అయ్యేవరకూ ఒక్కడే వుండాలి. చంద్రంగాడు వెళ్ళిపోతే ఇంక హాలులో పనిచేసేవాళ్ళలో తనీడు వాళ్ళెవరూ లేరు.

మరి కాసేపటికి నెమ్మదిగా చంద్రం తన కొత్త వుద్యోగం తాలూకు వివరాలు చెప్పాడు. బార్‌లో వుద్యోగం. ఈ వుద్యోగం లాగే ఆ పనికి పొద్దున వెళ్ళి రాత్రి పన్నెండింటి దాకా వుండాలి. ఈ వుద్యోగం లాగే ఆ వుద్యోగానికీ ఆదివారం శలవు లేదు. యీ వివరాలు చంద్రం దిగులుగానే చెప్పాడు. రాజిగాడు దిగులుగానే విన్నాడు. వొకళ్ళనుంచి మరొకళ్ళు విడిపోతున్నామన్న దిగులు యిద్దరిలోనూ వుంది. బెంగగా వున్నా తప్పదన్న విషయం ఆ పసివాళ్ళిద్దరికీ తెలుసు.

తెల్లారిందగ్గర్నించీ కొత్త ఉద్యోగం ఎలా వుంటుందో అన్న దిగులుతో చంద్రం, చంద్రం వెళ్ళిపోయిన దగ్గర్నించీ తన పనెలా వుంటుందో నన్న దిగులుతో రాజిగాడు, పెద్దగా మాటలేం లేకుండా సినిమా అయ్యేవరకూ అలాగే కూచున్నారు. సినిమా అయిపోయాక అసిస్టెంటు మేనేజరుకి చెప్పాక యిద్దరూ యింటికి బైల్దేరారు.

కొంచెం చీకటైనా యిద్దరికీ రోజూ అలవాటున్న దారే అది. ఇద్దరిళ్ళూ ఒక చోటే. మధ్యానం తిండి కోసం తెచ్చుకునే టిఫిన్ డబ్బా లేసుకున్న సంచీలు భుజానికి తగిలించుకున్నారు. చెయ్యీ, చెయ్యీ పట్టుకు నడుస్తున్నారు.

సినిమాహాలు దాటి అరఫర్లాంగు వచ్చాక హఠాత్తుగా వాడి బుర్రలో ఏదో మెరిసినట్టు.... "అరేయి రాజిగా...." అన్నాడు గట్టిగా చంద్రం ఆగిపోయి.

"ఏంటిరా....?" అన్నాడు రాజిగాడు.

"అదిగో అటు చూశావా...ఆ బార్లోనే నా వుద్యోగం. యిప్పుడు గుర్తొచ్చింది... వారం క్రితం మా అయ్య తీసికెళ్ళి ఆ

బార్ ఆయనకి నన్ను చూపించాడు...." అన్నాడు హుషారుగా.

"అయితే ఏంటిరా...." అన్నాడు రాజిగాడు.

"ఏంటేంటిరా....హలు, బార్ దగ్గర దగ్గరే. పొద్దున్న నువ్వూ నేను పదింటికేగా బైల్దేరేది. యిద్దరం కలిసే రావచ్చు అలాగే యిద్దరం ఎల్లేటప్పుడు యీ టైముకి పోవచ్చు" అన్నాడు.

రాజిగాడి ముఖంలోకి సంతోషం తన్నుకొచ్చింది. చేజారిపోయిన సామ్రాజ్యం తిరిగి సగం దక్కినట్టుంది వాడికి.

"ఎంచేరా మధ్యలో అప్పుడప్పుడు నేను నీ దగ్గరికి రావచ్చు కూడా. ....టిఫెన్ యిద్దరం కలిసే తినొచ్చు." అన్నాడు రాజిగాడు హుషారుగా.

కొన్ని గంటల క్రితం అనుకోకుండా వాళ్ళని కమ్ముకొన్న దిగులు కొద్దిగా తొలిగింది. అనుకోకుండా హఠాత్తుగా వాళ్ళనలా ఆ రోజు దిగులు కమ్ముకోటానికి అసలు కారణం దాని వెనక ఎకనమిక్స్ ఆ పసివాళ్ళిద్దరికీ తెలియవు. జీవితం వాళ్ళదే అయినా, దాన్ని నడుపుతున్న శక్తి గురించి వాళ్ళకి తెలీదు.

చంద్రం తండ్రి రామయ్యకి ఆ బార్ ఆయనతో నెలరోజుల క్రితం పరిచయం అయింది. ఆ తర్వాత కావాలనే రెండు సార్లు ఆయన దగ్గర కెళ్ళి కనిపించాడు. చివరికి పదిరోజుల క్రితం తన మనసులో మాట ఆయన చెవిన వేశాడు.

"సినిమాహాల్లో వాడికి నెలకి అరవై యిస్తున్నారు బాబూ. వీడి తర్వాత పిల్లలకి యింకా పనిలో పెట్టేంత వయసు రాలేదు. అందుకని మీరు దయతలిచి పనిలో పెట్టుకుని ఆ జీతంకన్నా పదో పాతికో ఎక్కువిస్తే, నాకెంతో మేలు చేసినవారవుతారు" అన్నాడు.

ఆయన అలాగే చూద్దాం అన్నాక, వారం క్రితం చంద్రంని తీసికెళ్ళి ఆయనకి చూపించాడు రామయ్య.

కొంచం బొద్దుగా, అమాయకంగా, నవ్వుముఖంతో వున్న చంద్రాన్ని చూడగానే ఆయన వ్యాపారం బుర్రలో వో అయిడియా మెరిసింది. దానివల్ల లాభం మాట ఎలావున్నా, ఫాన్సీగా వుంటుందని పించింది. అలా అనిపించిన వెంటనే వొప్పేసుకోకుండా చంద్రాన్ని కాస్త పరిశీలనగా చూసి, వూహలో వో రూపం ఏర్పరుచుకున్నాక.... "కుదురుతుందని చెప్పు న్నాడు." అన్నాడాయన. ఆ తర్వాత రామయ్య కోరిన మేరకు వొప్పుకున్నట్లు చంద్రాన్ని బార్‌లో పనికి పెట్టుకోటానికి వొప్పుకున్నాడు.

ఇరవై రూపాయల అదనపు ఆదాయం కోసం కొడుక్కి ఆ కొత్త వుద్యోగం రామయ్య చూశాడన్న సంగతి చీకటిలో అలా నడుస్తున్న ఆ పసివాళ్ళిద్దరికీ తెలియదు.

ఎందుకంటే ఎందరో పసివాళ్ళ లాగే వీళ్ళిద్దరి జీతాలు వీళ్ళ కోసం కాదు. వీళ్ళ యింటివాళ్ళ కోసం. చంద్రానికి అందుకే వుద్యోగం మార్పు తెలిసింది తప్ప, దాని వెనక జీతం మార్పు సంగతి తెలియదు.

* * *

ఆ మర్నాడే బార్ తాలూకు కొత్త వుద్యోగంలో చేరాడు చంద్రం. మొదటి రెండు రోజులు ఖాళీ గ్లాసులు పెట్టటం, ఐస్ అందించటం, సిగరెట్లు తేవటం లాంటి పనులు చెప్పారు. కానీ మూడో రోజు నుంచి వాడి అసలు వుద్యోగం మొదలైంది. వాడు ఆ బార్‌లో చేరిన రోజే యజమాని దగ్గరుండి టైలర్‌చేత వాడి కొలతలు తీయించాడు. డ్రెస్ తయారై రావటం మూడో రోజు వచ్చింది.

కాళ్ళకి పట్టేసే తెల్లటి పైజామా, మహారాజా టైపు ఉదారంగు కోటు, తలకి పాగా, తలపాగా మీద పక్షియీకలతో కుచ్చు....కాళ్ళకి చివర వంకీ తిరిగిన చెప్పుల్దగ్గర్నించీ మొత్తం చిన్న సైజు మహారాజా గెటప్ అది. ముందు ఆ డ్రెస్ వేసుకోటానికి సిగ్గుపడ్డాడు. కానీ మొదటి రోజే ఆ సిగ్గు. రెండో నాటికి అలవాటై పోయింది.

సాయంత్రం ఆరయ్యేటప్పటికి చంద్రం ఆ డ్రెస్ వేసుకుని గేటుదగ్గర నిలబడాలి. పొద్దున్నించీ రాత్రి వరకూ గేటుదగ్గర వుండే దర్వాన్ ఎప్పుడూ వుంటాడు. చంద్రం మాత్రం కస్టమర్స్ ఎక్కువగా వచ్చే సమయంలో అంటే సాయంత్రం ఆరు నుంచి రాత్రి పది వరకూ ఆ డ్రెస్ వేసుకుని మినీ మహారాజులా ఆ గేటుదగ్గర వుండాలి. వచ్చే కస్టమర్స్‌కి ఎలా దణ్ణంపెట్టాలో, ఏ రకంగా వంగి బౌ చెయ్యాలో అంతా ట్రైనింగ్‌యిచ్చారు వాడికి. సాయంత్రం అదీ డ్యూటీ, మిగిలిన సమయంలో బార్ లోపల చిన్న చిన్న పనులు చెయ్యటం... యిదీ చంద్రం కొత్త ఉద్యోగం.

యింటి దగ్గర్నించి రోజూ రాజిగాడు, చంద్రం యిద్దరూ కలిసే వస్తున్నారు. తిరిగి రాత్రిళ్లు యిద్దరూ కలిసే వెడుతున్నారు. ఎప్పటికప్పుడు బార్ తాలూకు కొత్త విషయాలు, వింతలూ, విశేషాలూ రాజిగాడికి చంద్రం చెపుతూనే వున్నాడు. సాయంత్రం పూట వీలుదొరికినప్పుడల్లా చంద్రం పనిచేసే బార్ దగ్గరకెళ్ళి రాజిగాడు చూస్తూనే వున్నాడు.

గ్లాస్ డోర్ దగ్గర.... ఆ చిత్రమైన బట్టల్లో చంద్రం ఎంతో గొప్పగా అందంగా కనిపించాడు. రాజిగాడు ఎంత సేపు చూసినా, ఎన్నిసార్లు చూసినా అలా చూస్తూనే వుండాలనిపించేది రాజిగాడికి. దూరంనుంచే చూసి సైగలతోటే కాస్సేపు చంద్రంతో మాట్లాడి వచ్చేస్తుండేవాడు.

పదిహేను రోజులు గడిచాయి. బార్ యజమాని అంచనా తప్పలేదు.

విషయం ఏదైనా, దాని వెనక కారణం, ప్రయోజనం వేరైనా వింతగా వుండే విషయానికి నగరంలో జనం సాధారణంగా యిచ్చేవిలువ, గుర్తింపు చంద్రం వేషానికి దక్కింది. పదిమంది జనం తనవేపు చూస్తున్నారన్న దృష్టి చంద్రానికి కూడా కలిగింది. మరి కొత్త స్టైలు, మరికొన్ని మేజిక్‌లు మొదలెట్టాడు. తాగేవాళ్ళు, తాగనివాళ్ళు చాలామంది గాసిప్‌లోకి చంద్రం వేషం చేరింది. ఆ బార్ పేరు నలుగురి నోళ్ళలో నానింది. కొద్దిగా కస్టమర్స్ కూడా పెరిగారు.

చంద్రం పనీ బాగానే వుంది. సినిమా హాల్‌లో పని కన్నా యిక్కడి పని తక్కువగా వుంది. సాయంత్రం ఆ నాలుగ్గంటల సేపూ మాత్రం తప్పని సరిగా ఆ డ్రస్‌వేసుకుని గేట్ దగ్గరుంటున్నాడు. మిగిలిన సమయంలో బార్‌లో పనిచేసినా, చెయ్యక పోయినా మనిషి ఎదురుగా వుంటే యింక యజమాని ఏం పట్టించుకోటం లేదు. మధ్య మధ్యలో అరగంటా, పావుగంటా బైట చెక్కర్లుకొట్టే అవకాశం కూడా దొరుకుతోంది. వీటన్నింటికీ మించి రోజూ కనీసం రెండు రూపాయలకి తక్కువ కాకుండా టిప్స్ దొరుకుతున్నాయి.

ఎప్పుడేనా తండ్రి పావలా, మహా అయితే అర్థరూపాయి యిస్తే ఎంతో గొప్పగా వుండేది చంద్రంకి. అలాంటిది రోజూ చేతిలో రెండు మూడు రూపాయలు ఎంతో గొప్పగా వుంది. ఆ గొప్పతనం తనలో దాచుకోలేనంత, తనవరకే వుంచుకోలేనంత గొప్పగా పెరిగిపోయింది.


అందుకని వీలున్నప్పుడల్లా సినిమా హాల్ దగ్గరికి పరిగెట్టేవాడు. రాజిగాడ్ని బైటికి పిలిచి గప్‌చిపులూ, మిర్చి, బజ్జీలు పల్లీలు యిలా రకరకాల తిండి పెట్టటం... తన వుద్యోగంలోని టిప్‌ల విషయం గొప్పగా చెప్పి మురిసిపోటం అలవాటు చేసుకున్నాడు. డబ్బు దుబారా చెయ్యకుండా దాచాలన్న ఆలోచన అలావుంచి దగ్గర డబ్బు కనిపిస్తే తండ్రి లాక్కుంటాడన్న భయం వల్ల ఎక్కువగా ఖర్చు చేసేయ్యటానికే చూసేవాడు చంద్రం.

అద్దం తలుపు దగ్గర, అందాల బొబులా కనపట్టమే కాకుండా, బాగా డబ్బు ఖర్చుపెట్టే హోదాలో చంద్రం కనిపించటం చూసిందగ్గర్నించీ రాజిగాడికి తన వుద్యోగం మీద అసంతృప్తి పెరగటం మొదలెట్టింది. పైగా చంద్రం వెళ్ళింపగ్గర్నించీ వాడి పనీ వీడి పనీ క్షణం తీరికలేకుండా తయారైంది రాజిగాడికీ.

చూసి, చూసి ఆఖరికి వో రోజు చంద్రంతో అననే అన్నాడు రాజిగాడు. "నీలాగా నాకూ ఏదేనా బార్‌లో వుద్యోగం దొరికితే బావుంటుందని...."

"మీ నాన్న నడగరా...." అన్నాడు చంద్రం.

తండ్రిని ఏదేనా అడగాలంటే భయం రాజిగాడికి. ఎలాగైతేనే నాలుగు రోజులు కనీసం నలభైసార్లు నానాయాతనాపడి చివరికి తండ్రి నడిగాడు. 'తనకూడా చంద్రంలా ఏదేనా బార్‌లో ఉద్యోగం చూడమని.'




ఆ మాట వింటూనే మండిపడ్డాడు రాజిగాడి తండ్రి. 'నీ కోసం బార్లన్నీ తిరుగుతా.... నోర్మూసుకుని వున్న కొలువు చెయ్యి చాలు....' అన్నాడు రాజిగాడి తండ్రి.

ఆ మర్నాడు తల్లితోకూడా చెప్పాడు రాజిగాడు. అయినా మరోసారి తండ్రిచేత తిట్లు తింటం తప్ప మరేం ప్రయోజనం కనిపించలేదు. తండ్రి ద్వారా వాడి ఆశ తీరే మార్గం కనిపించటంలేదు. తండ్రిని కాదని ఏదీ చెయ్యలేడు.

ఆశని చంపుకోలేక ఏదికూ తోచక వుక్కిరిబిక్కిరిగా వుంది రాజిగాడి ప్రాణానికి. సినిమా-హాల్‌ని, తన వుద్యోగాన్ని తలుచుకున్నా........ చంద్రంతో వెళ్ళి వాడి డబ్బులో ఏదేనా తింటున్నా చెప్పలేని అసహనంగా వుంటోంది. ఇదివరకటికన్నా చనువుగా వున్నా చంద్రం తనకి ఏదో దూరమైపోతున్నట్టు వుంది రాజిగాడికి.

మరో వారం లెట్టుకోగలిగాడు రాజిగాడు. ఆ తర్వాత వాడివల్ల కాలేదు.

ఆరోజు రాత్రి యింటికి వెళ్ళేటపుడు "అరేయి చంద్రం నువ్వే ఏదో గొడవ పెట్టుకుని ఆ బార్ వుద్యోగం మానెయ్యకూడదూ...." అన్నాడు.

"అదేంటిరా..ఎందుకు మానెయ్యటం" అన్నాడు చంద్రం ఆశ్చర్యంగా.

"మనిద్దరం వేరై పోతే.... నువ్వా పుద్యోగం మానేస్తే మళ్ళీ సినిమా హాల్లో చేరచ్చు. యిద్దరం యిదివరకులా కలిసుండొచ్చు...." అన్నాడు. అంత కన్నా వివరంగా ఏం చెప్పాలో అర్థం కాలేదు రాజిగాడికి,

"ఇప్పుడూ కలిసే వున్నాంగా. పైగా నేను బార్‌లో చేస్తేనే చేతిలో డబ్బులు. సినిమాహాల్లో చేస్తే ఏంవుంది. యిలా మనిష్టం వొచ్చినట్టు ఏదికావాలంటే అది కొనుక్కోటం ఎలా...." అన్నాడు చంద్రం.

రాజిగాడికి యింకేం మాట్లాడాలో తోచలేదు. కానీ ఆ విషయాన్ని వాడి మనసు మరిచిపోలేదు. ఒకలాగే బతికినా తమిద్దరిమధ్యా ఏదో తేడా....ఏదో దూరం....అదీ వాడి బాధ. అదీ వాడి అసహనం....

మరో నాలుగు రోజులకి రాజిగాడి అసహనం కోపంగా కసిగా మారింది. యిప్పుడు చంద్రం వాడి కళ్ళకి అద్దాల వెనక అందాలబాబులా కనిపించటంలేదు. ఆ అద్దాలవెనక తనకి అందకుండా తన వేపు చూసి నవ్వే బొమ్మలా కనిపిస్తున్నాడు. ఆ అద్దాలు తననీ, వాణ్ణీ.... తమస్నేహాన్ని వేరుచేస్తున్న తలుపుల్లా కనిపిస్తున్నాయి. అలాగే మరోవారం గడిచింది. చాలాసార్లు చాలా సేవు నిలబడి అడ్డుగోడల్లాంటి ఆ అద్దాలవేపు తదేకంగా చూశాడు రాజిగాడు.

ఆఖరికి వోరోజు రాత్రి ఏడింటికి, పెద్దరాయిని సూటిగా, కసిగా గురిచూసి విసిరాడు రాజిగాడు. అద్దాలు పగిలిన చప్పుడు వినిపించేంతవరకూ అక్కడే నిలబడ్డాడు. ఆ తర్వాత అక్కడ నిలబడకుండా పారిపోయాడు. పారిపోయే ముందు పగిలిన అద్దాలవేపు కంగారుగా చూసే ప్రయత్నంలో వున్న రాజిగాణ్ణి చంద్రం చూట్టం రాజిగాడు చూశాడు.

అద్దం పగిలిపోటంలో తన బాధ్యత లేకపోయినా కాళ్ళు వొణికాయి చంద్రానికి యజమాని అడిగితే ఏంచెప్పాలి? ఏం అడుగుతాడు....రాజిగాడి పేరు చెప్పాలా చెపితే వాణ్ణి పట్టుకొచ్చి తంతారేమో.... చెప్పకపోతే యింత మంచి వుద్యోగం పోతుందేమో. వాడికి కొద్దిక్షణాల్లోనే చెమటలు పట్టాయి.

చంద్రంకోసం ఆగకుండా బాగా ముందు ఒక్కడే యింటికెళ్ళిపోయాడు ఆ రాత్రి రాజిగాడు. 'అద్దం పగిలి పోయింది గొడవ జరుగుతుంది. యీ గొడవతో చంద్రం వుద్యోగం పోతే....' కొద్దిగా ఆశపడ్డాడు యిల్లుచేరిన రాజిగాడు. అయినా ఆ ఆశ వాడివరకూ వాడికే బలంగా అనిపించలేదు.

తనని చంద్రం చూశాడు. బార్ యజమానికి తనపేరు చెపుతాడా.... ఆ తర్వాత తండ్రికూడా తెలిస్తే కొడతాడేమో అన్న అనుమానం వచ్చింది రాజిగాడికి. యింకా చాలా అనుమానాలొచ్చాయి. అన్నింటికంటే యిక ముందు చంద్రం తనతో మాట్లాడడేమో అన్న భయం ఎక్కువ బాధపెట్టింది రాజిగాణ్ణి. యింతగా కలిసి బతికిన యిద్దరి స్నేహం ఏమైపోతుందో.... చంద్రం స్నేహం లేకపోతే యింక జీవితంలో ఏంలేనట్టు శూన్యంలా తోచింది రాజిగాడికి. ఆ రాత్రి అంతా భయం....యిబ్బంది....తిన్నగా నిద్దర పట్టలేదు రాజిగాడికి.

ఆ మర్నాడూ చంద్రన్ని తప్పించుకోవాలని తెల్లారగానే యింట్లోంచి వెళ్ళిపోయాడు రాజిగాడు. అయినా సాధ్యం కాలేదు. మొత్తానికి సాయంత్రంలోపు చంద్రానికి దొరికిపోయాడు,

దొరికీ దొరగ్గానే చంద్రం తిడతాడనుకున్నాడు. కానీ చంద్రం తిట్టలేదు. యిద్దరూ కలిసి కొంతదూరం వెళ్ళాక.... "ఎందుకురా అలాచేశావు?" అన్నాడు చంద్రం.

బదులేం చెప్పకుండా కోపంగా, వుడుకుమోత్తనంగా, నిస్సహాయంగా స్నేహితుడివేపు చూశాడు రాజిగాడు.

రాజిగాణ్ణి చూస్తూ చంద్రం యింకేం అనలేదు. వాడి భుజంమీద చెయ్యేసి ముందుకి నడిచాడు. నడుస్తూనే రాత్రి బార్‌లో జరిగింది చెప్పాడు. రాయి విసిరింది ఎవరో చూస్తే చెప్పమని యజమాని నిలదీయటం ఎవరో చూళ్ళేదని తను చెప్పటం, ఆ తర్వాత యజమాని దర్వాన్‌ని తిట్టటం....కేకలేయటం అన్నీ చెప్పాడు.... చెప్పి తనమీద కేంరాలేదనీ చెప్పాడు చంద్రం.

ఏదో జరుగుతుందేమో....యిద్దరూ విడిపోతారేమో.... స్నేహం దూరమైపోతుందేమో.... అనుకున్న యిద్దరికీ మనసు తేలిగ్గావుంది.

బార్ దగ్గరికొచ్చాక పగిలిన అద్దం కనిపించింది. జరిగిన విషయం యిద్దరికీ గుర్తుంది. కానీ అంతకు ముందు ఆ యిద్దరి స్నేహాన్ని జీవితాన్ని అలా కలవరపెట్టిన శక్తేమిటో, పసివాళ్ళు కాబట్టి వాళ్ళకి స్పష్టంగా తెలియలేదు.

అందుకే పగిలిన అద్దం కనిపిస్తున్న బార్ వేపు వెడుతున్న చంద్రాన్ని నవ్వుతూ సాగనంపాడు రాజిగాడు.

